
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శనివారం 9 మార్చి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.138	200	228
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 23.0

హర హర మహాదేవ



భువనగిరిలో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

హర హర మహాదేవ.. శంభోశంకర అంటూ శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లావ్యాప్తంగా భక్తులు దేవాలయాలకు పోటెత్తారు. సూర్యోదయానికి ముందే ఆలయాలకు చేరుకొని, ప్రత్యేక పూజ ల్లో పాల్గొని ఉపవాస దీక్షలు ఆరంభించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు ఆలయాలకు చేరుకొని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకొని రుద్రాభిషేకం, లింగాభిషేకాలు, కుంకుమార్చన లు, రుద్రహోమాలు నిర్వహించారు. మూల విరాట్‌కు పాలు, తేనె, నెయ్యి, పంచదార, పెరుగు, పండ్లు వంటి పంచామృతాల తో అభిషేకించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఎలాం టి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశా రు. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పం డువగా నిర్వహించారు. యాదగిరికొండపైన శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉద యం నుంచి భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలను చేపట్టిన భక్తులు సాయంత్రం వేళ పరమశివుడిని దర్శించుకుని అభిషేకం, అష్టోత్తర పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రివేళ కొండపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- భక్తులతో కిటకిటాలడిన ఆలయాలు
- కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

7,8

కాంగ్రెస్ టికెట్ రఘువీర్‌కే

- నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జానా తనయుడు
- తొలిజాబితాలో ప్రకటించిన అధిష్ఠానం
- భువనగిరి టిక్కెట్‌కోసం ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం



నల్లగొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కాంగ్రెస్ అభ్యర్థుల తొలిజాబితాలో నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డిని అధిష్ఠానం ప్రకటించింది. శుక్రవారం ప్రకటించిన తొలిజాబితాలో రాష్ట్రం నుంచి నాలుగు సీట్లకు అభ్యర్థులను ఖరారు చేయగా, అందులో నల్లగొండ సీటుకు క్లియరెన్స్ ఇవ్వగా, భువనగిరి స్థానానికి ఇంకా అభ్యర్థిని ఎంపిక చేయలేదు. మాజీమంత్రి కుందూరు జానారెడ్డి పెద్ద కుమారుడైన రఘువీర్‌రెడ్డి మొదటిసారి నేరుగా లోక్‌సభ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. జానారెడ్డి చిన్న కుమారుడు జైవీర్‌రెడ్డి గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా గెలుపొందగా, తాజాగా రఘువీర్‌రెడ్డి ఎంపీగా పోటీచేస్తుండడంతో జానా తనయులిద్దరూ క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చినట్లయింది. ప్రత్యక్ష ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేస్తున్నప్పటికీ రఘువీర్‌రెడ్డి తన తండ్రి జానారెడ్డి తరఫున ఆయన పోటీచేసిన పలు ఎన్నికల్లో ప్రచార బాధ్యతలు నిర్వర్తించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా 2009లో నియమితులైన ఆయన ఆ తర్వాత 2014, 2018లలో పీసీసీ సభ్యుడిగా కొనసాగారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియమితులయ్యాక ఆయన కార్యవర్గంలో 2021లో పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. చిన్నవయసులోనే ఎంపీగా పోటీచేసే అవకాశం రఘువీర్‌రెడ్డికి దక్కడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

భువనగిరి టిక్కెట్ కోసం తారస్థాయిలో ప్రయత్నాలు

నల్లగొండ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం భువనగిరి స్థానంలో అభ్యర్థిని ఇంకా తేల్చలేదు. దీంతో ఇక్కడ టిక్కెట్ ఆశిస్తోన్న నేతలు తమ ప్రయత్నాలు ఉధృతం చేశారు. కోమటిరెడ్డి సోదరులకు పట్టున్న ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ టిక్కెట్‌కోసం కోమటిరెడ్డి కుటుంబం నుంచి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి, డాక్టర్ కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డితో పాటు పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత, పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ టిక్కెట్‌కోసం ప్రయత్నిస్తున్నారు. కీలకమైన నేతలే బరిలో ఉండడంతో ఈ స్థానంలో అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుందనే అంశంపై అందరి దృష్టి నెలకొంది. ఈ స్థానంలో బీజేపీ నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు టిక్కెట్ దక్కడంతో కాంగ్రెస్‌లోనూ బీసీ నేతల్లో టిక్కెట్ ఆశలు పెరిగాయి. తీన్మార్ మల్లన్న సైతం ఎంపీ టిక్కెట్ ఆశించినప్పటికీ ఆయనకు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా అవకాశమిచ్చే ఆలోచనలో పార్టీ కీలక నేతలున్నట్లు తెలుస్తోంది. ఈ స్థానంలో టిక్కెట్ ఆశిస్తోన్న నేతలు ఎవరికి వారు తమ ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో అధిష్ఠానం ఎవరిని కరుణిస్తుందనే అంశంపై క్యాడర్‌లో ఆసక్తి నెలకొంది. గెలుపే లక్ష్యంగా ఏసమీకరణాన్ని అధిష్ఠానం ఇక్కడ అమలు చేస్తుందో వేచి చూడాల్సి ఉందని కీలకనేతలు పేర్కొంటున్నారు.

వక్ఫ్ భూముల ఆక్రమణలపై విచారణ

- వక్ఫ్ బోర్డు చైర్మన్ అస్మతుల్లా హుస్సేన్



మాట్లాడుతున్న అస్మతుల్లా హుస్సేన్

భువనగిరి టౌన్, మార్చి 8: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన వక్ఫ్ బోర్డు భూముల ఆక్రమణలు, పంపిణీలపై విచారణ జరుపుతామని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అస్మతుల్లా హుస్సేన్ అన్నారు. శుక్రవారం వరంగల్ వెళుతూ మార్గమధ్యంలోని భువనగిరిలో తనను కలిసిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని, భూముల గుర్తింపునకు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమిస్తే సహించబోమని, కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ అవేజ్ చిస్తి, నాయకులు ఎండీ సల్లాఉద్దీన్, ఎండీ అథర్, ఆబేద్ అలీ, అజాజ్, ఇంతియాజ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు నిధుల కొరత

- సెస్ బకాయిలు రూ.4.38 కోట్లు
- సరిపడా లేని సిబ్బంది
- అయినా నిరుద్యోగులకు అండగా గ్రంథాలయాలు



జిల్లాకేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న ఉద్యోగార్థులు

భువనగిరి టౌన్, మార్చి 8: గ్రంథాలయాల నిర్వహణకు స్థానిక సంస్థల నుంచి సెస్ రూపంలో అందే నిధులే ప్రధాన ఆదాయం. సెస్ సకాలంలో అందితే గ్రంథాలయాల నిర్వహణ సక్రమంగా ఉంటుంది. కానీ జిల్లా గ్రంథాలయ సంస్థకు జిల్లాలోని స్థానిక సంస్థల నుంచి ఇప్పటి వరకు రూ.4.38 కోట్ల సెస్ బకాయిగా రావాల్సి ఉంది. ఇందుకోసం జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు పలుమార్లు లేఖలు రాసినప్పటికీ, జిల్లా పాలన అధికారులు సమీక్షించి హెచ్చరించినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు మాత్రం సెస్‌ను గ్రంథాలయ సంస్థ ఖాతాలో జమచేయడాన్ని మాత్రం విస్మరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 16 గ్రంథాలయాలకు ఆన్ డిమాండ్ వెసులుబాటు కేవలం రూ.30వేలు మాత్రమే ఉంది. ఈ మొత్తంలో జిల్లాలోని ఏ గ్రంథాలయంలోనైనా పాఠకులు కోరిన పుస్తకాలను రూ.30వేల నుంచే సమకూర్చాల్సి ఉంటుంది. కానీ పోటీ పరీక్షల ముందు ఉద్యోగార్థులు కోరుతున్న పుస్తకాలను సకాలంలో సమకూర్చలేని పరిస్థితి గ్రంథాలయ సంస్థ అధికారులది. అలాగే సిబ్బంది, అధికారుల కొరత కూడా వేధిస్తోంది. కాగా జిల్లా గ్రంథాలయాల్లో వసతుల కల్పనకోసం కలకత్తాలోని రాజా రామ్ మోహన్‌రాయ్ ట్రస్ట్‌కు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే భువనగిరి గ్రంథాలయంలో నాలుగు కంప్యూటర్లు, గుండాలలో శాశ్వత భవనం, మిగతా లైబ్రరీలో కనీస వసతుల సమస్యలు తీరనున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగాలపై చిగురిస్తున్న ఆశలు

రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఉద్యోగ నియామకాలు చేపడుతూనే మరిన్ని కొత్త నోటిఫికేషన్లు జారీచేస్తుండడంతో నిరుద్యోగుల్లో ప్రభుత్వ ఉద్యోగాలపై ఆశలు చిగురిస్తున్నాయి. పలువురు అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబ పరిస్థితుల కారణంగా పుస్తకాలను కొనుగోలు చేయలేని పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు అండగా జిల్లా గ్రంథాలయ సంస్థ నిలుస్తోంది. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచడం, నిరుద్యోగులు ప్రశాంతంగా చదువుకునేలా గ్రంథాలయాల్లో సదుపాయాలు కల్పించడం తదితర ఏర్పాట్లను చేస్తోంది. దీంతో ఉద్యోగమే లక్ష్యంగా శ్రమిస్తున్న నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని గమ్యాన్ని చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో 16 గ్రంథాలయాలు

జిల్లాలో 16 గ్రంథాలయాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం భువనగిరిలో జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉండగా మరో 15 మండలాల్లో శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. కానీ నూతనంగా ఏర్పడిన మోటకొండూరు, అడ్డగూడూరు మండలాల్లో మాత్రం శాఖ గ్రంథాలయాల ఏర్పాటు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. జిల్లాలోని గ్రంథాలయాల్లో 93,487 పుస్తకాలు ఉండగాచ భువనగిరిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 22,228 పుస్తకాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 10,500 మంది గ్రంథాలయ సభ్యులుగా ఉండగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 1854 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. శాఖా గ్రంథాలయాలు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, తిరిగి సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు పని చేస్తుండగా భువనగిరిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం మాత్రం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటున్నది. అన్ని గ్రంథాలయాలకు ప్రతి శుక్రవారం సెలవుగా ఉంది.



జిల్లాకేంద్ర గ్రంథాలయ భవనం

అన్ని గ్రంథాలయాల్లో ప్రధాన దినపత్రికలతోపాటు సాహిత్యం, చరిత్ర, పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి.

సెలవు రోజుల్లోనూ తెరిచే..

నోటిఫికేషన్లు వెలువడుతున్న నేపథ్యంలో గ్రంథాలయాల్లో నిరుద్యోగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా భువనగిరిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేయాల్సి ఉన్నప్పటికీ నిరుద్యోగుల సదుపాయం కోసం రాత్రి పొద్దుపోయే వరకు తెరిచి ఉంచుతున్నారు. పాఠకుల విజ్ఞప్తి మేరకు సెలవు రోజులలో కూడా తెరుస్తున్నారు. రెండంతస్తులుగా ఉన్న భవనంలో రెండు ప్రత్యేక రీడింగ్ రూమ్స్ ఉన్నాయి. పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నారు.

పూర్తి సౌకర్యాలు కల్పిస్తున్నాం



పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగుల అవసరాలే లక్ష్యంగా జిల్లా గ్రంథాలయాలు పని చేస్తున్నాయి. ముఖ్యంగా భువనగిరిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పూర్తి సౌకర్యాలు కల్పిస్తూ ఉద్యోగాలను సాధించేలా అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాం. ఉద్యోగార్థులు కోరిన పుస్తకాలను వారం రోజుల వ్యవధిలో సమకూరుస్తున్నాం. పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాము. దాతలు సహకరిస్తే స్నాక్స్, చాయ్, తదితర సదుపాయాలు కల్పిస్తాం.

జి.సుధీర్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ.

'ఆమె'కు వందనం



అడ్డగూడూరులో కేక్ కట్ చేస్తున్న మహిళలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో తమదైన పాత్ర పోషిస్తున్న మహిళలను సన్మానించారు. మహిళల గొప్పతనాన్ని వక్తలు వివరించారు.

8

బెల్ట్ దుకాణాలను మూసివేయాల్సిందే

- చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు



మద్యం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళలు

చౌటుప్పల్ టౌన్, మార్చి 8: చౌటుప్పల్ మునిసిపాలిటీలో బెల్ట్ దుకాణాలను పూర్తిగా మూసివేసే వరకూ విశ్రమించేది లేదని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలో మునిసిపల్ చైర్మన్ రాజు ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. మద్యం మహమ్మారి, బెల్ట్ దుకాణాల దిష్టిబొమ్మను మహిళలు చెప్పులతో కొట్టి దహనం చేశారు. బెల్ట్ దుకాణాలను పూర్తిగా మూసివేసే వరకూ ఉద్యమాలను కొనసాగిస్తామని మహిళలతో చైర్మన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ వీధికి నాలుగు బెల్ట్ దుకాణాలను తెరిచి అమాయకులను మద్యానికి బానిసలుగా మారుస్తున్నారని, మహిళా చైతన్యంతోనే బెల్ట్ దుకాణాలకు చరమగీతం పాడతామన్నారు. బెల్ట్ దుకాణాలను మూసి వేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు మునిసిపాలిటీలోని సుమారు 250 బెల్ట్ దుకాణాలను మూసివేయించేందుకు నిర్ణయించామని, పేద కుటుంబాల జీవితాలను ఛిద్రం కాకుండా కాపాడుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కె.అలివేలు, తహసీల్దార్ హరికృష్ణ, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ట్రీనిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మంజుల, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యారాణి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు



ముఖమండపంలోని ఆళ్వార్ విగ్రహాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట, మార్చి8: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు స్వయంభూ పాంచనారసింహుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించనున్నారు. ప్రధానాలయ ఉద్ఘాటన తర్వాత రెండో వార్షిక బ్రహ్మోత్సవాలు. ప్రతీ ఏడాదీ ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి ఫాల్గుణ శుద్ధ ఏకాదశి వరకు 11 రోజుల పాటు వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 17న స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం, 18న బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవం, 19న దివ్యవిమాన రథోత్సవ పర్వాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం, 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.ఈ నెల 11 నుంచి 21 వరకు కొనసాగనున్న వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11రోజుల పాటు స్వామివారి నిత్య, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపివేయనున్నారు.

నిత్య, మొక్కుకల్యాణాలు..సుదర్శన హోమ పూజల నిలివేత

యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధిలో ఈ నెల 11 నుంచి 21 వరకు కొనసాగనున్న వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు స్వామివారి నిత్య, మొక్కుకల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపివేయనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ 11రోజులపాటు రాత్రివేళ నిత్యార్చనల అనంతరం రాత్రి 8.15గంటల నుంచి 9గంటల వరకు బలిహరణం, రాత్రి నివేదన జరుపుతారు. రాత్రివేళ 8గంటలకు అలంకార తిరువీధి సేవలు, సర్వదర్శనాలు ఆరంభించి రాత్రి 10గంటలకు శయనోత్సవ దర్శనం, ఆలయ ద్వారబంధనంగావిస్తారు. ఈ నెల 17 నుంచి 19 వరకు నిత్యార్చనలు, భోగములు, 20, 21వ తేదీల్లో భక్తులు జరిపించుకునే అభిషేకం, నిత్యార్చనలు రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. కాగా స్వామి సన్నిధిలో మొక్కు సేవలు ఈ 11రోజుల పాటు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారు.

అధికారుల సమీక్షలు.. సూచనలు

యాదాద్రీశుడు లక్ష్మీనృసింహుల వార్షిక వేడుకల కోసం అధికారులు ముందస్తుగానే ఏర్పాట్లు ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ పక్కా ప్రణాళికతో నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకనుగుణంగా అధికారులు అంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి సైతం ఇటీవల యాదగిరిక్షేత్రాన్ని సందర్శించి ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల నిఘాతోపాటు డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.



బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలకు పూజలు

యాదగిరీశుడి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలకు ప్రధానాలయంలో సంప్రదాయరీతితో అర్చకస్వాములు పూజలు నిర్వహించారు. ముందుగా గర్భాలయంలోని స్వయంభువుల వద్ద, అనంతరం ముఖమండపంలోని ఉత్సవమూర్తుల వద్ద ఆహ్వాన పత్రికలకు ఆచార్యులు పూజలు నిర్వహించి అధికారులకు అందజేశారు. బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలకు పూజల నిర్వహించడం ఆలయ సంప్రదాయం.

పండుగ పూట విషాదం

- వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి
- మృతుల్లో తండ్రీకుమారుడు, ఓ బాలుడు ..

అర్వపల్లి, మిర్యాలగూడ అర్బన్, మార్చి 8: మహాశివరాత్రి పండుగ పర్వదినాన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా, రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మృతుల్లో తండ్రీకుమారులు, బాలుడు ఉన్నారు. శుక్రవారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన ఈ సంఘటనలు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా అర్వపల్లి బొల్లంపల్లి గ్రామ శివారులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం మైదానంలో 15మంది క్రికెట్ ఆడుతున్నారు. గ్రామానికి చెందిన గద్దగూటి జానయ్య(38), కుమారుడు విఘ్నేష్(12)లు క్రికెట్ చూస్తున్నారు. అదే సమయంలో బొల్లపల్లి గ్రామానికి చెందిన క్రషర్ మిల్లు డ్రైవర్ శేఖర్ మద్యం మత్తులో టిప్పర్‌ను అతివేగంతో నడుపుతూ ఐకేపీ కేంద్రం మైదానంలోకి దూసుకువచ్చాడు. అక్కడ కూర్చుని క్రికెట్ చూస్తున్న జానయ్య టిప్పర్‌ను గమనించి పక్కనే ఉన్న కుమారుడు విఘ్నేష్‌ను కాపాడటానికి యత్నించినా ఫలితం లేకపోయింది. టిప్పర్ అతివేగంగా వచ్చి తండ్రీ కుమారులను ఢీకొట్టటంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. జానయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా, చిన్న కుమారుడు విఘ్నేష్ చివ్వెంల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో గురువారం ఇంటికి వచ్చి మృత్యువాత పడ్డాడు. టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని ఘటనా స్థలంలోనే వదిలేసి అక్కడినుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై జానయ్య భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్‌నాథ్ తెలిపారు.

వాహనం పైనుంచి పడి బాలుడి మృతి

వేగంగా వెళ్తున్న స్కూటీ అదుపు తప్పి కిందపడిపోయిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ రాములు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం మైసమ్మకుంటతండాకు చెందిన తేజావత్ రమేష్ కుమారులు లక్షణ్, ప్రభాస్(13) తాగునీటి కోసం స్కూటీపై వాటర్‌ట్యాంక్‌తండాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మైసమ్మకుంటతండా శివారులో వేగంగా వస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగా గాయపడిన సోదరులను స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్కూటీ నడుపుతున్న ప్రభాస్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో డాక్టర్ల సూచన మేరకు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందాడు. లక్ష్మణ్ ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. బాలుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తపడాలని సీఐ వీరబాబు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కొండమల్లేపల్లి, మార్చి 8: బైక్ అదుపు తప్పి తీవ్ర గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదం కొండమల్లేపల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్రంపోడు మండలం తేనేపల్లి గ్రామానికి చెందిన రాసిక సునీత, లక్ష్మయ్య దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రాసిక మణికంఠ(14) గుర్రంపోడులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. మణికంఠ గురువారం ద్విచక్రవాహనంపై నాంపల్లి మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలంలోని కొత్తబాయి గ్రామశివారులో బైక్ అదుపుతప్పి మిషన్ భగీరథ ట్యాంక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన మణికంఠను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించాయి. మృతుని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.



సూర్యాపేటలో శివ లింగానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు





నల్లగొండ ఛాయా సోమేశ్వరాలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు



నల్లగొండ ఛాయా సోమేశ్వరాలయంలో కోలాటం ఆడుతున్న విద్యార్థులు





నల్లగొండ ఛాయా సోమేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం

శంభో శివశంభో

ఉపవాస దీక్షతో ముక్కంటిని దర్శించుకున్న భక్తులు

ఉమ్మడి జిల్లాలో శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు



సూర్యాపేటలో ..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిలాల్లోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. నల్లగొండ జిల్లాలోని చాయా, పచ్చలసోమేశ్వరాలయం, దామరచర్ల మండలంలోని మీనాక్షీ అగస్తేశ్వరస్వామి ఆలయం, నార్కట్‌పల్లి మండలంలోని చెర్వు గట్టు జడల రామలింగేశ్వర క్షేత్రం, సూర్యాపేట జిల్లాలోని పిల్లలమర్రి ఆలయం, మేళ్లచెర్వులోని శివాలయం, యాదాద్రిభువనగిరి జిల్లాలోని యాదగిరిక్షేత్రంలోని శివాలయం, బీబీనగర్ మండలంలోని అక్కన్నమాదన్న ఆలయాలు, భువనగిరిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉపవాస దీక్షలో ఉన్నవారితో పాటు ఇతర భక్తులు ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.



బీబీనగర్‌లో శివపార్వతుల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



చౌటుప్పల్ పట్టణంలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



మఠంపల్లిలో...



మిర్యాలగూడలో పూజల్లో పాల్గొన్న భక్తులు



నల్లగొండలో కల్యాణానికి హాజరైన భక్తులు

యాదగిరిక్షేత్రంలో శాస్త్రోక్తంగా మహాశివరాత్రి పర్వాలు

» రాత్రి లింగోద్భవ కాలంలో శతరుద్రాభిషేక పూజలు » బర్కత్‌పుర నుంచి అఖండ జ్యోతి యాత్ర ప్రారంభం

యాదగిరిగుట్ట, మార్చి 8: యాదగిరిక్షేత్రంలో కొండపైన అనుబంధ శివాలయంలో మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని విశేష పూజా పర్వాలు శైవాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. శివాలయ అర్చకబృందం, వేదపండితులు ఉదయం నిత్యవిధి పూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా అభిషేక పూజలు కొనసాగగా భక్తులు కుటుంబసమేతంగా అభిషేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన పురోహితుడు సత్యనారాయణశర్మ శివరాత్రి మహత్యాన్ని భక్తులకు వివరించారు. రాత్రి వేళ లింగోద్భవ సమయంలో ఆలయ అర్చకులు, రుత్వికులు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేక పూజలను నిర్వహించారు.



గుట్ట శివాలయ మండపంలో స్ఫటికమూర్తులకు హారతి నివేదిస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. గర్భగుడిలోని సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను 108 బంగారు పుష్పాలతో అర్చించారు. గర్భాలయంలోని స్వయంభువులను వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలు, కుంకుమతో సహస్రనామార్చనలు, అష్టభుజి ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,26,828 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. యాదగిరీశుడి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో ఆహ్వాన పత్రికతో పాటు అభిషేకం లడ్డూ ప్రసాదాలను ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిసి అందజేశారు.

వార్షిక ఉత్సవాలకు ఏర్పాట్లు: ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. హైదరాబాద్ బర్కత్‌పురలోని యాదగిరి భవన్ వద్ద అనువంశిక ధర్మకర్త బీ.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావులతో కలిసి సంప్రదాయరీతిలో అఖండ జ్యోతిని వెలిగించి యాత్రను ప్రారంభించారు. ముందుగా యాదగిరిగుట్ట దేవస్థాన ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకబృందం లక్ష్మీనృసింహుడిని కొలుస్తూ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యాత్ర హైదరాబాద్, బర్కత్‌పుర యాదగిరిభవన్ వద్ద ప్రారంభమై నాలుగు రోజుల పాటు ఉప్పల్, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, రాయగిరిల మీదుగా భక్తుల పూజలు అందుకుంటూ ఈ నెల 11న యాదగిరిగుట్ట పట్టణానికి చేరుకుంటుందని తెలిపారు.

హర హర శంకర.. జయ జయ శంకర

» శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు » జాగరణ, ఉపవాస దీక్షలో భక్తులు » ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి కోమటి వెంకటరెడ్డి, జిల్లా జడ్జి నాగరాజు

నల్లగొండ కల్చరల్, మార్చి 8 : హరహర మహదేవ.. శంభో శంకర.. అంటూ భక్తుల శివనామస్మరణతో శైవ క్షేత్రాలన్నీ మార్మోగాయి. భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని అభిషేకాలు, రుద్రాభిషేకం, లింగాభిషేకాలు, కుంకుమార్చనలు, రుద్ర హోమాలు నిర్వహించారు. జిల్లా కేంద్ర సమీపంలోని పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తులు శివ పార్వతులకు అభిషేకాలు, రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు నవీన్ శర్మ ఆధ్వర్యంలో పూజలు ఘనంగా జరిగాయి.

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం, నార్కట్‌పల్లి రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన ప్రత్యేక పూజల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు పాల్గొన్నారు.

దామరచర్ల: మండలంలోని శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వర, శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్లను దర్శించుకున్నారు. కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రదేశంలో నీళ్లు అడుగంటడంతో భక్తులు స్నానాలు చేసేందుకు ఆలయ సమీపంలోని షవర్స్‌ను ఏర్పాటు చేశారు. శ్రీ మీనాక్షి అగస్తేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూజలు నిర్వహించారు. పురాతన త్రిలింగేశ్వరాలయంలో పెద్ద ఎత్తున స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 6వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మేళ్లచెర్వు: మహాశివరాత్రి సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భావకాల, మహాన్యాస పూర్వక, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభిషేకాలు ప్రారంభించాల్సి ఉండగా, ఢిల్లీ పర్యటనలో ఉండటంతో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి మహాజాతరను ప్రారంభించారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తెల్లవారుజామున రెండు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవం నిర్వహించారు.



నల్లగొండలో అభిషేకంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పిల్లలమర్రి దేవాలయంలో వేచి ఉన్న భక్తులు

నేరేడుచర్ల: ప్రాచీన సోమప్ప దేవాలయంలో ఉదయం 3గంటల నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాతలు తాగునీటి సరఫరా చేశారు.బారులుతీరి దర్శనం చేసుకున్నారు.

సూర్యాపేటరూరల్: పిల్లలమర్రి శివాలయాల్లో ఉదయం 4గంటల నుంచి మహన్యాస పూర్వక పూర్వక రుద్రాభిషేకం, ఎర్రకేశ్వరాలయం, త్రికూటేశ్వరం ఆలయాల్లో మధ్యాహ్నం 1-30 గంటలకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహణ బసవముద్ద, రాత్రి 12-30 గంటలకు లింగోద్భవ కాలంలో దేవతామూర్తుల కళ్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు.

భువనగిరి టౌన్: భువనగిరిలోని శ్రీ పచ్చలకట్ట సోమేశ్వరాలయం, దక్షిణేశ్వరాలయం, శ్రీ భవానీ రామలింగేశ్వర ఆలయంతో పాటు పట్టణంలోని అన్ని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. శివపార్వతుల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

బీబీనగర్: మహాదేవ్‌పూర్ గ్రామంలోని అక్కన్న మాదన్న ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామి, రుక్మిణి సత్యభామ సతీసమేత శ్రీ వేణుగోపాల స్వామి, చిన్న రావులపల్లిలో కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేణుగోపాల స్వామి మండపంలో ఉత్సవాల తొలిరోజు అష్టోత్తర కలశాభిషేకం, ధ్వజారోహణం, హోమం కార్యక్రమాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. చిన్న రావులపల్లిలోని రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు.

శివోహం



నాగిరెడ్డిపల్లి రమణేశ్వరంలో అభిషేకం చేస్తున్న మంత్రి కొండా సురేఖ

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో గల శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠాన్ని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకున్నారు. ఈసందర్భంగా సిద్దగురు రమణానంద మహర్షి ఆమెకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మాయ దశరథ తదితర ప్రముఖులు ఆలయాల్లో పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు.

● బీబీనగర్ మండలంలోని మహాదేవ్‌పూర్‌లోని అక్కన్న మాదన్న, రామలింగేశ్వర స్వామి ఆలయాలను జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎంపీపీ సుధాకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, బొక్క జైపాల్ రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు దండెం ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, పొట్టోళ్ల శ్యాంగౌడ్, సత్తిరెడ్డి, నరేందర్ రెడ్డి, తాజామాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, బాలమణి దేవదాసు పాల్గొన్నారు.

● ఆలేరులో శివాలయంలో పాటు కొలనుపాకలోని సోమేశ్వరాలయం, శర్బణాపురంలోని ఉమాశంకర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమాశంకర ఆలయంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం శ్రీవీరభద్ర ఆలయంలో విప్ దంపతులు శివలింగానికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

● వలిగొండ మండలంలోని త్రిశక్తి పీఠంతో పాటు పలు ఆలయాల్లో, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు, గుండాల, రాజాపేట, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, రామన్నపేట, మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● భూదాన్‌పోచంపల్లిలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక ఉమామహేశ్వరుల వ్రతతాలను నిర్వహించారు. బుగ్గరామన్న స్వామి, నల్లవీరభద్రస్వామి దేవాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

● మోత్కూరులో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి స్వామివారికి అభిషేకం జరిపించారు.



వలిగొండలోని త్రిశక్తి ఆలయంలో పాల్గొన్న భక్తులు



మోత్కూరులో పసుపు, కుంకుమతో ఏర్పాటు చేసిన శివలింగం



భువనగిరిలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు





సైదాపురంలోని వీరభద్రస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య దంపతులు



నాగిరెడ్డిపల్లి రమణేశ్వరంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



ఆలేరు శివాలయం వద్ద బారు తీరిన భక్తులు



బీబీనగర్: అక్కన్న మాదన్న ఆలయంలో అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని పలువురు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సదస్సులు, సన్మానాలు నిర్వహించారు. మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు.

భూదాన్‌పోచంపల్లి, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోముల మమత బస్వారెడ్డి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ నాయకులను కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్లాక్ మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు కుడికాల సుజన, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోముల మమత, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మెరుగు శశికళతోపాటు ఆయా గ్రామాలకు చెందిన మహిళా నాయకులు వారాల కృష్ణవేణి, ఇందిరమ్మ, వారాల నిర్మల, లక్ష్మి తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, నాయకులు శ్రీశైలం, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా, కనుముకుల గ్రామానికి చెందిన పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహిళాదినోత్సవం సందర్భంగా మహిళలను ఆలయ నిర్మాణకర్తలు, జడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోట మల్లారెడ్డితోపాటు పాక నర్సింహ, ఆలయ పూజారి చిలకమర్రి వంశీకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: మహిళలు ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్ అన్నారు. మండలంలోని బస్వాపురంలో జరిగిన కార్యక్రమంలో స్థానికులు ఆమెను ఘనంగా సన్మానించారు. బీయన్‌తిమ్మాపురంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలను ఘనంగా సన్మానించి మిఠాయి తినిపించారు.

చౌటుప్పల్ టౌన్ : మహిళలు ఐక్య పోరాటాలతోనే సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో శుక్రవారం మండల వ్యవసాయ కార్మిక సంఘం ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకురాలు చిదుగుళ్ల యాదమ్మను సన్మానించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగదేవి సైదులు, గుంటోజు శ్రీనివాస్‌చారి, బొజ్జ బాలయ్య, బోయ యాదయ్య, మామిడి స్వరూప, పద్మ, బాలరాజ్ లు పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో మహిళలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంస్థాన్ నారాయణపురం: మహిళల శ్రమ సంస్కృతిని గౌరవించాలని అఖిల భారత మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు దోనూరు నిర్మల అన్నారు. అఖిల భారత మహిళా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అల్లందేవి చెరువు గ్రామంలో వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యురాలు గుండు జయమ్మను సన్మానించారు. ఈసందర్భంగా నిర్మల మాట్లాడుతూ అంతర్జాతీయంగా మహిళల సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు సాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకురాలు గంగాదేవి పుష్పమ్మ, జెనిగల పద్మ,గుండు సుశీల, గుండు రామేశ్వరి, శరగోని యాదమ్మ, గుండు ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సామాజిక ఉద్యమకారుడు కమ్మంపాటి కుమార్ అన్నారు. మండలంలోని చౌళ్లరామారం గ్రామంలో కేక్ కట్ చేసి, పలువురిని సన్మానించారు.

మోత్కూరు : మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డిని శుక్రవారం బీసీరిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, పి.నర్సింహ, బి.యాదయ్య, బి.మత్స్యగిరి పాల్గొన్నారు.



మోత్కూరు: మునిసిపల్ చైర్‌పర్సన్ కవితలక్ష్మీనర్సింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



భువనగిరిరూరల్: బస్వాపురంలో ఎంపీపీ నిర్మలను సన్మానిస్తున్న మహిళలు

మోత్కూరుకు నేడు ఎమ్మెల్యే రాక

మోత్కూరు, మార్చి 8: మోత్కూరు మునిసిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం (ఈ నెల 9న) మోత్కూరు రానున్నారని కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, గుండగోని రామచంద్రు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజుయాదవ్

భూదాన్‌పోచంపల్లి, మార్చి 8: బీజేపీ మండల అధ్యక్షుడిగా దేశ్‌ముఖి గ్రామానికి చెందిన దుర్గం రాజుయాదవ్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్ నియామక పత్రాన్ని శుక్రవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ మండలంలో బీజేపీ పటిష్టత కోసం తనవంతు కృషి చేస్తానని, తనకు ఈ పదవి కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మోత్కూరులో వరుస దొంగతనాలు

● *భయాందోళనలో ప్రజలు, రైతులు*

మోత్కూరు, మార్చి 8: మోత్కూరులో ఒకే రోజు పగలు తాళం వేసిన ఇంట్లో, రాత్రి వేళ వ్యవసాయ పంపుమోటర్ల వద్ద విద్యుత్ సర్వీస్ దొంగతనాలు జరుగడంతో ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే... మోత్కూరులో అంగడిబజారులోని ప్రాథమిక పాఠశాల ఎదురుగా నివసించే బట్టు లింగయ్య, అతని భార్య అండాలుతో కలిసి గురువారం ఉదయం గొర్రెలను మేతకు తోలుకెళ్లారు. మధ్యాహ్నం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం వారి కుమారుడు ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గ్రహించిన అతను తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. తల్లిదండ్రులు వచ్చిచూసి దొంగలు ఇంట్లో చొరబడి రూ.20 వేల నగదు, సుమారు రూ.80 వేల విలువ కల్గిన 12 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించారని, క్లూస్ టీంతో విచారణ జరిపించారని బాధితుడు తెలిపారు.

ఎనిమిది బండిళ్ల కేబుల్ వైర్ చోరీ

మోత్కూరు పట్టణానికి చెందిన పంగ సుంకయ్య, గుండు యాదయ్యకు చెందిన ఎనిమిది బండిళ్ల విద్యుత్ సర్వీస్ వైరు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బిక్కేరు వాగు వెంట ఉన్న రైతులు వాగు మధ్యలో చేతి బోర్లు వేసుకుని, వాగు ఒడ్డున ఉన్న విద్యుత్ స్తంభం నుంచి మోటారు వరకు సర్వీసు వైరు తీసుకెళ్లి అక్కడ స్టార్టర్ బిగించుకుని కేబుల్ వైర్‌తో మోటారుకు కనెక్షన్ ఇస్తారు.

ఆ ఇద్దరు రైతులు శుక్రవారం ఉదయం తమ వ్యవసాయ పంపుసెట్ల వద్దకు వెళ్లే సరికి కరెంటు సర్వీస్ వైరు లేదు. గుర్తు తెలియని వ్యక్తులు తమ సర్వీస్ వైరు దొంగిలించారని వారు చెప్పారు. రెండు బండిళ్ల వైర్ ఎత్తుకెళ్లారని గుండు యాదయ్య, తనది ఆరు బండిళ్ల వైర్ ఎత్తుకెళ్లారని పంగ సుంకయ్య తెలిపారు. ఈ విషయమై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను సహించం

● **బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనగోని దేవేందర్**

సంస్థాన్‌నారాయణపురం మార్చి 8: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యకుడు బచ్చనగోని దేవేందర్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల సమావేశం జరిగింది. ఈసందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్టీ మండల సమావేశంలో అధ్యక్షుడి ఎంపిక కోసం మండల కమిటీ తరఫున జిల్లా కమిటీకి కొన్ని పేర్లు పంపించామని ఆయన తెలిపారు. పార్టీ నాయకుడైన ఆత్కూరి రాములు పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా తానే అధ్యక్షుడినని ప్రకటించుకుని పార్టీ శ్రేణులను అయోమయానికి గురి చేశాడని అన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందున రాములుపై జిల్లా నాయకులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎంతటి వారైనా పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు దోనూరువీరారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సురవి రాజు గౌడ్, నాయకులు తంగెళ్ల సత్తయ్య, వంగరి రఘు, దాసోజు వెంకటాచారి, కుకుడాల మహేందర్‌రెడ్డి, జక్కర్తి భిక్షం, బండమీది కిరణ్, గొల్లూరి యాదగిరి, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

భువనగిరి రూరల్, మార్చి 8: బాధిత రైతు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని గౌస్‌నగర్‌కు చెందిన రైతు నల్లమాసు బాలయ్య(65) అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.30వేల నగదు సాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎలిమినేటి మల్లారెడ్డి, సీఈవో దంతూరి నర్సింహ, నల్లమాస రాములు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో ఆరోగ్యమిషన్ ఉద్యోగాల మెరిట్‌లిస్ట్

భువనగిరి అర్బన్, మార్చి 8: జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో అభ్యర్థుల ఫైనల్ మెరిట్ ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వైద్యాధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్, ఎంఎల్‌హెచ్‌పీఎస్, స్టాఫ్ నర్సింగ్, రిఫ్రిజిరేటర్ మెకానిక్, సైక్రియాటిస్ట్, టీబీహెచ్‌వీ, వీసీ సీఎం, జిల్లా ప్రోగ్రాం అధికారి పోస్టులకు గాను ఫైనల్ మెరిట్ www.yadadri.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బాలల సక్షేమ సమితి సంరక్షణలో బాలుడు

భువనగిరి అర్బన్/ బీబీనగర్, మార్చి 8: బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం గ్రామంలో తప్పిపోయి తిరుగుతున్న బాలుడిని పెట్రోలింగ్ మొబైల్ పోలీసులు జిల్లా బాలల సంక్షేమ సమితి సంరక్షణలో ఉంచారు. ఎక్కడి నుంచి ఎలా వచ్చాడో తెలియకపోగా గ్రామంలో వీధుల వెంట తిరుగుతున్న బాలుడిని గ్రామస్థులు గుర్తించి, పెట్రోలింగ్ మొబైల్ పోలీసులకు తెలియజేశారు. దాంతో వారు బాలుడిని ఆధీనంలోకి తీసుకుని విచారించగా బాలుడికి మాటలు రావని తెలిసింది. ఆచూకీ తెలుసుకోలేకపోయారు. కొద్దిగా వినికిడి ఉండి హిందీని అర్థం చేసుకోగలుతుగున్నాడని గుర్తించారు. అనంతరం తాత్కాలిక సంరక్షణ కోసం బాలుడిని జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులుకు అప్పగించారు. బాలుడి ఆచూకీ ఎవ్వరికైనా తెలిస్తే జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.



బాలల పరిరక్షణ అధికారి సంరక్షణలో ఉన్న బాలుడు

మిమి క్రాఫ్ట్‌ను సందర్శించిన తమిళనాడు అధికారులు

చౌటుప్పల్ రూరల్, మార్చి 8: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం టెక్స్‌టైల్ పార్క్‌లోని మిమి క్రాఫ్ట్ హస్తకళల సంస్థను తమిళనాడు రాష్ట్రానికి చెందిన కో ఆప్టెక్స్ సంస్థకు చెందిన 60 మంది అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. హస్తకళల ప్రాముఖ్యం గురించి మిమి క్రాఫ్ట్ వ్యవస్థాపకుడు కె.కృష్ణమూర్తి వివరించారు. బ్లాక్ ప్రింటింగ్, బాతిక్ ప్రింటింగ్, టై అండ్ డై ప్రింటింగ్ పద్ధతులను పరిశీలించారు. కార్యక్రమంలో శ్యామ్‌కుమార్, పుష్పలత, చేనేత జౌళిశాఖ ఏడీఓ ప్రసాద్ పాల్గొన్నారు.



వస్త్రాలను పరిశీలిస్తున్న తమిళనాడు కో ఆప్టెక్స్ అధికారులు

వ్యక్తి మెడలోంచి గొలుసు అపహరణ

చౌటుప్పల్ రూరల్ మార్చి 8: రోడ్డు దాటుతున్న వ్యక్తి మెడలో నుంచి బైక్‌పై వచ్చిన దొంగలు బంగారు గొలుసు లాక్కెళ్లారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలం కోతులాపురం గ్రామానికి చెందిన పొట్ట వెంకటేష్‌ం చౌటుప్పల్ బస్టాండ్ వద్ద గురువారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్ళారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అడ్డగూడూరు, మార్చి 8: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... అడ్డగూడూరు మండలం, కొడంపేట గ్రామానికి చెందిన గొలుసుల వెంకన్న (50) పది సంవత్సరాల క్రితం ఉపాధి కోసం హైదరాబాదులోని మల్లంపేటలో నివాసం ఉంటున్నాడు. సొంతంగా సిమెంట్ బ్రిక్స్ ఇటుకలను తయారు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన సొంత గ్రామమైన కొడంపేటకు వచ్చి కారులో తిరిగి వెళుతుండగా గురువారం రాత్రి హైదరాబాదులోని ఓఆర్‌ఆర్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గొలుసుల వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపున్న వెంకన్న అల్లుడు మురళికి తీవ్ర గాయాలయ్యాయి. మురళిని చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఒక ప్రైయిట్ ఆస్పత్రికి తరలించారు. వెంకన్నకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కూమారుడు ఉన్నారు.

ప్రత్యేక నిధులతో బోరు వేయించిన ఎమ్మెల్యే

ఆత్మకూరు(ఎం) మార్చి 8: మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నివాసులకు మంచినీటి కొరత తీర్చడానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక నిధుల నుంచి బోరు, మోటారు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నివాసులు తాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా బోరు మోటారుతోపాటు, గ్రామానికి మరో రెండు మంచినీటి మోటార్లు మంజూరు చేసినట్లు లక్ష్మారెడ్డి తెలిపారు. బోరు సక్సెస్ కావడంతో కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తాజా మాజీ సర్పంచ్ జెనగేష్ , పట్టణ కాంగ్రెస్ అద్యక్షుడు పి.మల్లేశం పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద బోరు వేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు